క్లుప్తంగా

సాగు భూములు పట్టాచేశారని ఆందోళన

హుస్నాబాద్‌రూరల్: సాగు చేస్తున్న భూములను కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా పట్టా చేసుకున్నారని ఆరోపిస్తు మంగళవారం మండలం పోతారం(ఎస్)లో దళితులు ఆందోళన చేపట్టారు. తమకు న్యా యం చేయాలంటూ భూ వ్యాపారులు హుస్నాబాద్‌లో నిర్వహిస్తున్న హోటల్ ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. తమ తాతలు 60 ఏళ్ల నుంచి కాస్తు చేస్తున్న భూములను మోక విచారణ చేయకుండా అక్రమంగా అధికారులు పట్టా చేశారని ఆరోపించారు. ధర్నా విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి న్యాయం చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఘనంగా భీష్మ ఏకాదశి

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లిలో ఏకాదశ గంగ పుత్ర సంఘం ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని మంగళవారం ర్యాలీ తీశారు. పీఎస్ఆర్ ట్రస్ట్ నిర్వాహకుడు పొల్కంపల్లి నరేందర్ గంగపుత్రుల జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం గంగపుత్రుల ఆర్థికాభివృద్ధికి సహకరించినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సహకరించాలన్నారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షుడు దొంతి సత్తయ్య, నాయకులు సంపత్, మల్లేశం, నాగరాజు, నర్సింహులు, సత్తి ఇస్తారు, భూపాల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలు ప్రశంసనీయం

గజ్వేల్ ఏసీపీ బాలాజీ

ములుగు(గజ్వేల్): గజ్వేల్ రోటరీ క్లబ్ సేవలు ప్రశంసనీయమని గజ్వేల్ ఏసీపీ బాలాజీ, క్లబ్ జిల్లా పాస్ట్ గవర్నర్ రవి అన్నారు. గజ్వేల్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు బాబుగౌడ్ ఆధ్వర్యంలో మండలంలోని వంటిమామిడిలో మంగళవారం 150 మంది పేద విద్యార్థులకు ఉచితంగా సైకిళ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. స్వచ్ఛంద సంస్థలు సేవా భావంతో పనిచేసినప్పుడే గుర్తింపు లభిస్తుందన్నారు. గజ్వేల్ రోటరీ క్లబ్ మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. 7వ తరగతి విద్యార్థి నెహాల్‌గౌడ్ చదివి వినిపించిన క్లబ్ నివేదిక అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ నరేష్‌గౌడ్, క్లబ్ కార్యదర్శి నర్సింహారెడ్డి, కోశాధికారి శ్రీనివాస్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, డాక్టర్ పురుషోత్తం, కరుణాకర్‌రెడ్డి, చంటి, బాపురెడ్డి, నర్సింహారెడ్డి, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


ఓటరు నమోదు ప్రక్రియ పరిశీలన



ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి తిరుమలరావు

కొమురవెల్లి(సిద్దిపేట): తహసీల్దార్ కార్యాలయంలో ఖమ్మం, వరంగల్, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియను ఎన్నికల అధికారి తిరుమలరావు మంగళవారం పరిశీలించారు. మండలంలో ఎంత మంది పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికలో ఓటు వేసేందుకు నమోదు చేసుకున్నారు, వారు సరైన పత్రాలు జత చేశారా? లేదా? అనే విషయాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, నాయబ్ తహసీల్దార్ వేణుగోపాల్, ఆర్ఐ శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలో అక్రమాలు బహిర్గతం



సామాజిక తనిఖీ ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

చిన్నకోడూరు(సిద్దిపేట): ఉపాధి హామీ పనులు చేయకుండానే మస్టర్లు రూపొందించి నిధులు కాజేసినట్లు అధికారులు గుర్తించారు. చిన్నకోడూరులో మంగళవారం నిర్వహించిన ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీలో పలువురి అక్రమాలు వెలుగు చూశాయి. మండలంలో రూ.4.90 కోట్లతో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి వరకు చేపట్టిన 861 రకాల పనులు చేపట్టినట్లు అడిషనల్ డీఆర్‌డీఓ బాలకిషన్ తెలిపారు. అక్రమాలకు పాల్పడిన వారి నుంచి రూ.69,500 రికవరీకి ఆదేశించామన్నారు.

నేడు కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సీఎస్ఆర్ నిధులతో రూపొందిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే హరీశ్‌రావు బుధవారం ప్రారంభించనున్నారు. రూ.50 లక్షలతో అధునాతన హంగులతో ల్యాబ్ ఏర్పాటు చేశారు. ఇప్పటికే జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, మల్టీపర్పస్ హైస్కూల్‌లో ఇటువంటి ల్యాబ్‌లు ఉన్నాయి.

లింగాకర్షక బుట్టలతో మొగి అంచనా!

జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్



వరి పొలాలను పరిశీలిస్తున్న శివకుమార్

కొమురవెల్లి(సిద్దిపేట): రైతులు మొగి పురుగు ఉధృతిని తెలుసుకోవడానికి లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ సూచించారు. మంగళవారం మండలంలోని పోసాన్‌పల్లి గ్రామంలో వరి పొలాలను, ఆయిల్‌పామ్ తోటలను మండల వ్యవసాయ అధికారి నరేశ్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. వరిలో ప్రస్తుతం మొగిపురుగు ఉధృతి ఎక్కువగా ఉందని దానిని తగ్గించేందుకు రైతులు సాయంత్రం వేళల్లో గట్లపై చిన్న మంటలు వేయాలన్నారు. దీంతో తల్లి పురుగులు మంటలో పడి చనిపోతాయని చెప్పారు. ఉధృతిని బట్టి నివారణ చర్యలు తీసుకోవాలని, నాటు వేసిన నెలరోజుల్లో కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 50 శాతం ఎస్‌సీ అనే మందును లీటర్ నీటికి రెండుగ్రాముల చొప్పున పిచికారీ చేసుకోవాలని తెలిపారు. ఆయిల్ పామ్ సాగులో వేసవిలో మొక్కలకు క్రమం తప్పకుండా డ్రిప్ ద్వారా నీరు అందించాలని, మొక్కల మొదలు భాగంలో దుక్కిని లోతుగా చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

సమస్యలపై ఐక్యంగా ఉద్యమించాలి

ఐద్వా కేంద్ర కమిటీ సభ్యురాలు ఆశాలత



మాట్లాడుతున్న ఆశాలత

సిద్దిపేటఅర్బన్: మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐక్యంగా ఉద్యమించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) కేంద్ర కమిటీ సభ్యురాలు ఆశాలత పిలుపునిచ్చారు. మంగళవారం సిద్దిపేటలోని ఐద్వా జిల్లా కార్యాలయంలో జాలిగాపు శిరీష అధ్యక్షతన జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో మహిళలపై జరుగుతున్న దాడులు, హత్యలు, అత్యాచారాలు, గృహహింసను అరికట్టాల్సిన పాలకవర్గాలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారన్నారు. ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ తగ్గించి పని నుంచి కూలీలను దూరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. పాలకులు అనుసరిస్తున్న మహిళా వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి శారద, శోభ, విఘ్నేశ్వరి, పద్మ, కనకవ్వ, పద్మ, రేవతి, భాగ్యలక్ష్మి, జయశ్రీ, ఉపేంద్ర, వరలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు లింకేజీలపై ..

దౌల్తాబాద్(దుబ్బాక): దౌల్తాబాద్, రాయపోల్ మండలాలకు చెందిన ఐకేపీ, ఏపీఎంలు, సీసీల సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశానికి అడిషనల్ డీఆర్డీఓ మధుసూదన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన బ్యాంకు లింకేజీ, తదితర అంశాలు వివరించారు. కార్యక్రమంలో ఐబీ డీపీఎం విద్యాసాగర్, ఫైనాన్స్ డీపీఎం రాజయ్య, ఏపీఎంలు కిషన్, దుర్గయ్య, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ సేవలు చిరస్మరణీయం

దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి



మిరుదొడ్డిలో ఇందిరా గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): దివంగత ప్రధాని ఇందిరా గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన మిరుదొడ్డిలో ఆమె విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు మెదక్ ఎంపీగా పోటీ చేసి గెలిచిన అనంతరం ఉమ్మడి జిల్లాను దేశంలోనే అభివృద్ధి పథంలో నిలిపిన ఘనత ఇందిరాగాంధీకే దక్కిందన్నారు. అనంతరం దుబ్బాక మార్కెట్ కమిటీ తాజా మాజీ వైస్ చైర్మన్ చెక్కపల్లి పద్మయ్య బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్‌స్వామి గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



స్వయం పాలనలో పాల్గొన్న విద్యార్థులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మేడిపల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈఓగా ధనుష్, ఎంఈఓగా రాజేష్, హెచ్ఎంగా లహరి, పలువురు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు.

వర్గల్(గజ్వేల్): మండలంలోని చౌదరిపల్లి జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం స్వయం పాలన దినోత్సవం జరిగింది. విద్యార్థులు తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈఓగా నవ్యశ్రీ, డిప్యూటీ డీఈఓగా మణితేజ, ఎంఈఓగా మైత్రి, హెచ్ఎంగా శ్రీవాణి వ్యవహరించారు. హెచ్ఎం వెంకట్‌రెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మంగళవారం స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. కలెక్టర్‌గా సాయి తరుణ్, డీఈఓగా సింధుజ, ఎంఈఓగా సాయి రామ్, హెడ్‌మాస్టర్‌గా సురేష్, ఉపాధ్యాయులుగా అర్చన, అంజలి, అర్చన, నిఖిత, స్వామి విధులు నిర్వహించారు.

రక్షణ చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

సీఐ కిరణ్

హుస్నాబాద్: కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా బాలికలు, మహిళల రక్షణ చట్టాలు, సైబర్ నేరాలపై మంగళవారం పట్టణంలోని సీవీ రామన్ ఉన్నత పాఠశాలలో షీటీమ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కిరణ్ మాట్లాడారు. పాఠశాలల్లో ఈవ్ టీజింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మైనర్లు వాహనాలు నడపొద్దని సూచించారు. వేధింపులపై 100కు డయల్ చేసి సమాచారం అందించాలన్నారు.

తొగుట(దుబ్బాక): మహిళల భద్రత పోలీసుల బాధ్యతని ఎస్ఐ లింగం అన్నారు. మంగళవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల కోసం అనేక చట్టాలున్నాయన్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా సమాచారం తెలియజేయాలన్నారు.

దుబ్బాకరూరల్ : మండలంలోని తిమ్మాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, మానవ అక్రమ రవాణా, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దుబ్బాక సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ అపరిచితులను నమ్మొద్దన్నారు. విద్యార్థులు కలిసి మెలిసి ఉండాలన్నారు.

తిరిగి విధుల్లోకి తీసుకోవాలి

అవుట్ సోర్సింగ్ స్టాఫ్ నర్సులు



వినతిపత్రం అందజేస్తున్న అవుట్ సోర్సింగ్ స్టాఫ్ నర్సులు, సీఐటీయూ నాయకులు

సిద్దిపేటకమాన్: విధుల నుంచి తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని అవుట్ సోర్సింగ్ స్టాఫ్ నర్సులు హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నోడల్ అధికారికి సీఐటీయూ నాయకులతో కలిసి మంగళవారం వినతిపత్రం అందజేసినట్లు స్థానిక నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రైవేటు ఏజెన్సీ ద్వారా అవుట్ సోర్సింగ్‌లో స్టాఫ్ నర్సులుగా విధులు నిర్వహించారన్నారు. కరోనా సంక్షోభంలోనూ ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించి ఎంతో మంది ప్రాణాలు కాపాడినట్లు తెలిపారు. అవుట్ సోర్సింగ్ స్టాఫ్ నర్సులను విధుల నుంచి తొలగించారని, మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని కోరారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని నోడల్ తెలిపినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, అవుట్ సోర్సింగ్ స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

ఆరోరోజూ సేవలు బంద్



తెరుచుకోని తహసీల్దార్ కార్యాలయ గది

కొండపాక(గజ్వేల్): కొండపాక తహసీల్దార్ గది తలుపులు మంగళవారం తెరుచుకోలేదు. వరుసగా ఆరు రోజులుగా రెవెన్యూ సేవలు బంద్‌కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయానికి వచ్చినవారు అధికారి లేకపోవడంతో నిరాశతో వెనుదిరిగివెళ్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రెవెన్యూ శాఖలో బదిలీల పరంపరలో భాగంగా ఫిబ్రవరి 1వ తేదీన కొండపాక తహసీల్దార్ శ్రీనివాస్ గజ్వేల్‌కు, గజ్వేల్ తహసీల్దార్ బాలరాజును కొండపాకకు ప్రభుత్వం బదిలీ చేసింది. గురువారం కొండపాక నుంచి వెళ్లిన శ్రీనివాస్ గజ్వేల్‌లో బాధ్యతలు చేపట్టారు. కాగా గజ్వేల్ నుంచి బదిలీ అయిన బాలరాజు మాత్రం బాధ్యతలు చేపట్టలేదు. దీంతో రెవెన్యూ సేవలు నిలిచిపోయాయి. ఐదు రోజులుగా సేవలు బంద్ అనే కథనాన్ని సాక్షి దినపత్రికలో సోమవారం ప్రచురితమైంది. దీంతో మంగళవారం మధ్యాహ్నం కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రెవెన్యూ సేవలు కొనసాగేలా డిప్యూటీ తహసీల్దార్ నీలిమకు బాధ్యతలు అప్పగిస్తారన్న ప్రచారం జరిగింది. దీంతో రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన ప్రజలు మంగళవారం సాయంత్రం వరకు ఎదురు చూశారు. 4 గంటల వరకు కలెక్టర్ రాకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు.

నమస్తే స్కీంపై అవగాహన



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఆకుల రజిత అధ్యక్షతన మంగళవారం నమస్తే స్కీంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెప్టిక్ ట్యాంక్ వర్కర్లు మున్సిపల్ నుంచి లైసెన్స్‌లు తీసుకోవాలన్నారు. వర్కర్లు తప్పకుండా పీపీఈ కిట్లను ధరించాలని సూచించారు. నమస్తే స్కీం ద్వారా ఆరోగ్య బీమా, రుణాలు, రాయితీపై కొత్త వాహనాలు కొనుగోలుకు అవకాశం కల్పించారన్నారు. ప్రతీ సెప్టిక్ ట్యాంక్ ఆపరేటర్ ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సర్ అయిలేని అనిత, కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్ గోవిందు రవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ రవికుమార్, జవాన్లు సారయ్య, ప్రభాకర్, ఆపరేటర్లు పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన

పట్టణంలోని ఎల్లమ్మ చెరువు సమీపంలో జరిగే సమ్మక్క, సారలమ్మ జాతర ఏర్పాట్లను మంగళవారం మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పించాలన్నారు. పారిశుద్ధ్యం, తాగు నీటి వసతి, వాహన పార్కింగ్, జాతర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు పున్న లావణ్య సది, గోవిందు రవి, వల్లపు రాజు, వేణు, మాజీ ఎంపీపీ వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

ముసుగు తొలగేనా?



ముసుగులో అంబేద్కర్ విగ్రహం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలో పదేళ్ల క్రితం డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేశారు. రాజకీయ నాయకుల మధ్య తలెత్తిన విభేదాల వల్ల విగ్రహం ఆవిష్కరణకు నోచుకోవడం లేదు. అప్పటి నుంచి ఆ విగ్రహం ముసుగుకే పరిమితమైంది. ముసుగు చినిగిపోతున్నా పట్టించుకునేవారు లేరు. విగ్రహావిష్కరణ జరుగుతుందా? లేదా? అప్పుడు ఎందుకు ఏర్పాటు చేసినట్టు అని స్థానికుల్లో ఆవేదన వ్యక్తమవుతోంది.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

నంగునూరు(సిద్దిపేట): కోనాయపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయ ద్వితీయ బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. బుధవారం సాయంత్రం విష్వక్సేన ఆరాధన, పుణ్యాహ వాచనం, అంకురార్పణ, రక్షాబంధనం, తీర్థప్రసాద వితరణ, గురువారం విష్వక్సేన ఆరాధన, పుణ్యాహ వాచనం, ధ్వజారోహణం, దేవతాహ్వానం, నిత్యహోమం, మధ్యాహ్నం శ్రీ భూనీల సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం, ద్వారతోరణ ధ్వజకుంభారాధన, నిత్యహోమం, తీర్థప్రసాద వితరణ శుక్రవారం ద్వారతోరణ, ధ్వజకుంభ ఆరాధన తీర్థప్రసాద వితరణ, శనివారం స్వామివారి కల్యాణం, అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఇసుక లారీల పట్టివేత



మద్దూరులో పోలీసులు పట్టుకున్న ఇసుక లారీ

మద్దూరు(హుస్నాబాద్): ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న లారీని సోమవారం అర్ధరాత్రి మద్దూరు పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం ఎస్ఐ షేక్ యునూస్ అహ్మద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం సోమవారం రాత్రి పెట్రోలింగ్ సిబ్బంది మండలంలోని నర్సాయపల్లి నుంచి గాగిల్లిపూర్ వెళ్తున్నారు. ఈక్రమంలో రాంపూర్ క్రాస్‌రోడ్ వద్ద ఎదురుగా వస్తున్న లారీని ఆపి తనిఖీ చేయగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో ఇసుక లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించి అక్కన్నపేట మండలానికి చెందిన లారీ యజమాని అజ్మీర్ మోహన్‌పై కేసు నమోదు చేసిన్నట్లు ఎస్ఐ తెలిపారు.

సిద్దిపేటకమాన్: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం సిద్దిపేట పట్టణం కప్పలకుంట్ల వడ్డెర కాలనీలో ప్రభుత్వ అనుమతి లేకుండా కల్యాణ్ ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకొని సిద్దిపేట వన్ టౌన్ పోలీసులకు అప్పగించారు.

రెండు టిప్పర్లు సీజ్

కొండపాక(గజ్వేల్): మండలంలో అక్రమ మట్టిదందాను అరికట్టేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. మంగళవారం మండల కేంద్రమైన కొండపాక శివారులో మట్టిని అక్రమంగా టిప్పర్లలో తరలిస్తుండగా ఆర్ఐ బాలకిషన్ పట్టుకొన్నారు. వాటిని కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి, ఇసుకను అక్రమంగా తరలించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

రామలింగేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు



ఆలయంలో హుండీని లెక్కిస్తున్న సిబ్బంది

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని బెక్కల్ రామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం హుండీ లెక్కించారు. ఆలయ ఈఓ విశ్వనాథశర్మ పర్యవేక్షణలో 2023 మార్చి 2వ తేదీ నుంచి మంగళవారం వరకు భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు చేపట్టారు. మొత్తం రూ.2,01,367 ఆదాయం సమకూరింది. ఈ మొత్తాన్ని మండల కేంద్రంలోని ఎస్‌బీఐలో జమ చేశారు. అనంతరం ఈనెల 24 నుంచి ప్రారంభం కానున్న స్వామివారి బ్రహ్మోత్సవాల్లో టెంకాయలు, ప్రసాదాలు విక్రయించుకునేందుకు వేలం పాట నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ విజయ్‌కుమార్, ఆలయ అర్చకుడు సిద్ధాపురం భద్రప్ప, దేవాదాయశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆర్టీసీ కార్మికులకు భోజన వసతి

హుస్నాబాద్: మేడారం జాతరలో విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర కార్మికులకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచనల మేరకు భోజన వసతి కల్పించేందుకు దాతలు ముందుకు వచ్చారు. మంగళవారం బస్ డిపోలో ఆర్టీసీ కార్మికులకు భోజన వసతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మేడారం జాతరలో విధులు నిర్వహిస్తున్న 200 మంది కార్మికులకు దాతల సహకారంతో ఈనెల 23 వరకు డిపోలోనే భోజన వసతి కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, వ్యాపారవేత్తలు ఆంజనేయులు, బాలకిష్టయ్య, తేరాల మారుతి, కొత్త శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ నిధులు మంజూరు

బెజ్జంకి(సిద్దిపేట): వేసవిలో మానకొండూర్ నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టినట్లు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపెల్లి సత్యనారాయణ తెలిపారు. మంగళవారం నియోజకవర్గంలోని ఎల్ఎండీలో గల క్యాంపు కార్యాలయంలో మిషన్ భగీరథ ఈఈ అంజన్‌రావుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి నీటి ఎద్దడి నివారణకు రూ.కోటి మంజూరు చేశామన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించారు.

◆ జాతర ఏర్పాట్ల పరిశీలన

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని దేవక్కపల్లెలో నిర్వహించనున్న సమ్మక్క, సారలమ్మ జాతర ఏర్పాట్లను ఎస్ఐ కృష్ణారెడ్డి పరిశీలించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ జంగిటి సంజీవరెడ్డి, వైస్ చైర్మన్ రంగారెడ్డి, సభ్యులు దేవారెడ్డి, సత్తయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రత్యేక పూజలు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి శివారు పాపన్నపల్లెలోని హనుమాన్ దేవాలయంలో మంగళవారం హోమాలు నిర్వహించారు. ధ్వజ స్తంభం, నవగ్రహాల ప్రతిష్ఠ వేడుకలను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కుంకుమ పూజలో పాల్గొన్నారు.

◆ ఎల్లమ్మ బోనాల ఊరేగింపు

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయ పంచమ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం పెద్దఘటం పూజ, శ్రీ రేణుకా ఎల్లమ్మ, జమదగ్ని కల్యాణం, ఒడి బియ్యం కార్యక్రమాలు జరిగాయి. గౌడ సంఘం ఆధ్వర్యంలో మహిళలు బోనాలతో రేణుకా ఎల్లమ్మ దేవాలయం వరకు ఊరేగింపుగా వచ్చారు. ఊరేగింపులో శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారికి బోనాలు సమర్పించారు.

◆ మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, బీజేఆర్ చౌరస్తాతో పాటు పలు చోట్ల గత వారం రోజులుగా తమ సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చారు. మంగళవారం విచారణ జరిపిన జడ్జి శ్రావణి ఆరుగురికి రూ.9 వేల జరిమానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

◆ ఆలయ జాతర కమిటీ ఏకగ్రీవం

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి శివారులోని కూడవెల్లి వాగు పరిసర ప్రాంతంలో నూతనంగా నిర్మించనున్న శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ జాతర కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా తోట దుర్గారెడ్డి, ఉపాధ్యక్షులుగా రంగనమైన మల్లేశం, చల్లూరి మల్లేశం, తోకల శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా రాందేవ్ జ్ఞానేశ్వర్, ధర్మారం బాబు, కోశాధికారులుగా ఇరుకుల్ల శ్రీశైలం, చాట్లపల్లి పర్శరాములు గౌడ్, కార్యదర్శులుగా పసులకాడి అంజయ్య, సిద్దాల సత్తయ్య, కమ్మరి మల్లేశం, ధార మల్లయ్య, కార్యవర్గ సభ్యులుగా ఎల్లయ్య, దుర్గయ్య, తిరుపతి, రాములు, రాజు, ఆంజనేయులు, రాజుతోపాటు మరో 28 మందిని సభ్యులను ఎన్నుకున్నారు.

◆ సిద్దిపేట వాసుల సేవాకార్యక్రమాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్యలో సిద్దిపేట వాసులు సేవా కార్యక్రమాలు చేస్తున్నారని విశ్వహిందూ పరిషత్ మెదక్ విభాగ్ సహ కార్యదర్శి గ్యాదరి రాజారాం మంగళవారం తెలిపారు. సిద్దిపేట నుంచి అయోధ్యకు తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 12 మంది ప్రబంధకులు సేవకులుగా విశ్వహిందూ పరిషత్ తెలంగాణ శాఖ నియమించిందన్నారు. తెలంగాణ నుంచి వచ్చే కార్యకర్తలకు వసతులు, భోజన సౌకర్యం, రవాణా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు.

◆ మండల సర్వసభ్య సమావేశం

దుబ్బాకరూరల్: ఎంపీపీ కొత్త పుష్పలత అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గురుకుల పాఠశాలలకు మౌలిక సదుపాయలు కల్పించాలని ఎంఈఓ ప్రభుదాస్ దృష్టికి చీకోడ్ ఎంపీటీసీ రాంరెడ్డి తీసుకెళ్లారు. పోతారెడ్డిపేట ఎంపీటీసీ చందసాగర్ మాట్లాడుతూ గ్రామంలోని పెద్ద చెరువుకు యాసంగి సాగుకు నీరు విడుదల చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ అస్క రవి, సూపరింటెండెంట్ శ్యామల, ఎంపీఓ నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీ ఫోరం మండల అధ్యక్షుడు చందసాగర్ తదితరులు పాల్గొన్నారు.

◆ టెండర్ల ఆహ్వానం

సిద్దిపేటరూరల్: భేటీ బచావో భేటీ పడావో పథకం కింద జిల్లాలో అన్ని పంచాయతీల్లో ఆడ, మగ పిల్లల పుట్టుక శాతాన్ని సూచించే విధంగా యూవీ ప్రింటింగ్ గల్వాన్ స్టీల్ షీట్ తయారుచేసే వారి నుంచి టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమశాఖ అధికారి సావిత్రి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 499 పంచాయతీల్లో పిల్లల పుట్టుక శాతం చూపించేలా రెండు వైపులా పవర్ కోటింగ్‌తో తయారు చేసిన బోర్డ్స్‌ను నిర్దేశించిన ప్రదేశాలలో అమర్చాలని సూచించారు. వాటికి అయ్యే ధరను కోరుతూ టెండర్లను 25వ తేదీలోపు కలెక్టరేట్‌లోని జిల్లా సంక్షేమ అధికారికి అందజేయాలని కోరారు.

◆ అనాథ బాలల జన్మదిన వేడుకలు

బెజ్జంకి(సిద్దిపేట): బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం బెజ్జంకి క్రాసింగ్‌లో అనాథ బాలలకు జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలవికాస ప్రోగ్రాం అధికారి లత మాట్లాడారు. బాలవికాస సంస్థ 40 ఏళ్లుగా 1500 గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.